క్లుప్తంగా

అర్వపల్లి ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, కొమ్మాలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన బలరాముడి భక్తులు ఆదివారం అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపు జరిపారు. అయోధ్యలోని బలరాముని దర్శనానికి వాహనాల్లో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో మండల రామ భక్తులు పగిళ్ల శంకర్, కీర్తి వెంకటేశ్వర్లు, పాక వీరేష్‌యాదవ్, కూర శంకర్, బొల్లం సైదులు, గుండె మల్లారెడ్డి, బుర్ర జనార్దన్, దిలీప్‌రెడ్డి, శతకోటి వెంకన్న తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాగారం : బిక్కేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈటూరు గ్రామ సమీపంలోని బిక్కేరువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఈటూరు గ్రామ శివారులో పట్టుకొని సీజ్‌చేసి, కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

డీఎస్పీ రవికి సన్మానం

అర్వపల్లి : సూర్యాపేట డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి.రవిని ఆదివారం జిల్లా పరిషత్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు, జాజిరెడ్డిగూడెం జెడ్పీటీసీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే ఎస్‌ఐ, సీఐగా పనిచేసి ప్రజల మన్ననలు పొంది ఇక్కడికే మళ్లీ డీఎస్పీగా రావడం హర్షణీయమన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

సూర్యాపేట : ఇమాంపేట ప్లాంట్ నుంచి సూర్యాపేట టౌన్ పైపు లైన్‌కు లీకేజీ మరమ్మతు పనులు చేస్తున్నందున రెండు రోజుల పాటు పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసు ఆదివారం తెలిపారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

గడ్డివాము దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాము

ఆత్మకూర్ (ఎస్) : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పుల శ్రీశైలం తన ఇంటి పక్కనే గడ్డివామును ఏర్పాటు చేసుకున్నాడు. మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే దాదాపు 150 కట్టల గడ్డి కాలిపోయింది.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన పీఈటీ సైదుల మహేష్ జ్ఞాపకార్థం అదే గ్రామానికి చెందిన స్నేహితులు, 2017–18 టెన్త్, బీపీటీ బ్యాచ్ విద్యార్థులు కలిసి ఆదివారం గ్రామంలో మహేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని కోరారు. మహేష్ చిన్నతనంలోనే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, దాసరి సోమయ్య, శిగ నసీర్‌గౌడ్, గుడిపల్లి మధూకర్ రెడ్డి, బింగి కృష్ణమూర్తి, చింతల సురేష్, తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

అనంతగిరి : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తగోల్‌తండా, పాతగోల్‌తండా, మీట్యాతండా, కొత్తగూడెం, చనుపల్లి, కిష్టపురం, పాలారంతండా గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. మండలంలో ఉపాధిహామీ నిధులు రూ.2.80కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోతు బాబునాయక్, బుర్ర పుల్లారెడ్డి, ముత్తినేని కోటేశ్వరావు, వేణు, జ్ఞానేందర్‌రెడ్డి, ముసుగు మధుసూదన్‌రెడ్డి, కత్రం నాగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు

- తుంగతుర్తి మండలంలోని చాలా గ్రామాల్లో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న ఆట స్థలాలు
- గ్రామాలకు దూరంగా ఏర్పాటు, క్రీడా సామగ్రి అందుబాటులో లేక వినియోగించని యువత



కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం



గానుగుబండలో..

తుంగతుర్తి : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లక్షల రూపాయలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఈ క్రీడా ప్రాంగణాలను పాఠశాలల్లో, ఐకేపీ కేంద్రాల్లో, శ్మశాన వాటికల వద్ద, పల్లె ప్రకృతి వనాల వద్ద, మరికొన్నిచోట్ల ఊళ్లకు దూరంగా ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణాల్లో క్రీడాకారులు ఆటలు ఆడేందుకు ప్రభుత్వం క్రీడా సామగ్రిని కూడా అందజేసింది. కానీ క్రీడా సామగ్రిని క్రీడాకారులకు ఇవ్వకుండా గ్రామ పంచాయతీల్లోనే ఉంచుతున్నారు. దీంతో క్రీడాకారులకు సామగ్రి లేకుండాపోయింది. క్రీడా ప్రాంగణాలు ఊళ్లకు దూరంగా ఉండడం, సరైన క్రీడాసామగ్రి అందుబాటులో లేకపోవడంతో యువత వాటిని ఉపయోగించుకునేందుకు ఆసక్తి కనబరచడంలేదు. ఈ క్రీడా ప్రాంగణాలకు ఎలాంటి ప్రహరీలు కూడా నిర్మించలేదు. కొన్ని గ్రామాల్లోని స్థలాల్లో కేవలం నేమ్‌బోర్డులు మాత్రమే ఏర్పాటు చేసి వదిలేశారు. క్రీడామైదానాల ఆవరణలో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. తుంగతుర్తి మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కానీ గ్రామీణ యువత వాటిలో ఆటలు ఆడిన దాఖలాలు లేవు. మండలంలోని ధరావత్‌తండా, రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడానికి స్థలం లేకపోవడంతో వదిలేశారు. తుంగతుర్తిలో క్రీడా ప్రాంగణం నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. మొత్తానికి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు చాలా వరకు గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్రీడాప్రాంగణాలను యువత వినియోగించుకునేలా క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తేవాలి



గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులు క్రీడల్లో రాణించేందుకు లక్షల రూపాయలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ క్రీడా ప్రాంగణాలను అనువైన స్థలాల్లో ఏర్పాటు చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. పైగా క్రీడా సామగ్రి కూడా అందుబాటులో ఉండడంలేదు. అధికారులు క్రీడా ప్రాంగాణాల్లో సౌకర్యాలు కల్పించి అందుబాటులోకి తేవాలి.

– బుర్ర శ్రీనివాస్, అన్నారం

అంబేద్కర్, ఫూలే విగ్రహాలకు నివాళి



తిమ్మాపురంలో అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో బీసీ కుల గణనకు ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ మండల పరిధిలోని తిమ్మాపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్య, మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి, సీనియర్ నాయకుడు రత్నం లక్ష్మాజీ, సీపీఎం మండల మాజీ కార్యదర్శి ఎల్లంల అవిలయ్య, కొణతం కరుణాకర్‌రెడ్డి, రత్నం సంతోష్, మద్ది లింగరాజు, కర్కాని సైదులు, రజాక్, కందుకూరి మహేష్, బింగి బాలరాజు, ఎస్.లక్ష్మణ్, జ్యోతుల వెంకన్న, జీడి సైదులు, బొడ్డు రమేష్, జీడి శ్రీకాంత్, శేఖర్, మహేష్, రవి, హరీష్, ఉమేష్, ఉజ్జిత్, వినీష్, నాయకులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి



పస్తాలలోని జీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నాగారం : నాగారం మండల పరిధిలోని పస్తాల గ్రామ ఎస్సీ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ కాలనీకి చెందిన యువకులు ఆదివారం గ్రామ కార్యదర్శి శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పబ్లిక్ కులాయి లేక తాగునీటి కోసం కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలనీలో పబ్లిక్ కులాయిలు ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారోబార్ బుక్క అంజయ్య, కాలనీ వాసులు బొజ్జ మురళి, కండె ప్రవీణ్, కండె విజయ్, బొజ్జ శ్రీకాంత్, బొజ్జ రమేష్, నాగరాజు, మహేష్, సురేష్, చింతకుంట్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేటటౌన్ : కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని, సంపూర్ణ వికాసం కలుగుతుందని, చురుకుదనం పెరుగుతుందని అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఎస్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ సంకినేని కృష్ణారావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏవీఎం పాఠశాలలో అక్షర ఫౌండేషన్, షీ టీం ఆధ్వర్యంలో బాలబాలికలు, మహిళలకు ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న అక్షర ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. అక్షర ఫౌండేషన్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు నాగయ్య, సొల్లేటి ఉపేంద్రాచారి, ప్రిన్సిపల్ ఫాతిమా, జనార్దనచారి, నరాల తిరుమలరెడ్డి, రుద్రంగి కాళిదాసు, వీరాసింగ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలి



నూతనకల్ : చిల్పకుంట్లలో బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరి : మాలిపురంలో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



మద్దిరాల : మామిళ్లమడవ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి మూడో వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాల సుదర్శన్‌రెడ్డి, వల్లమల్ల జయాకర్, కళ్లెం కృష్ణారెడ్డి, తీగల గిరిధర్‌రెడ్డి, పన్నాల మల్లారెడ్డి, బిక్కి శ్రీనాథ్, పులుసు సైదులు, బత్తుల నాగమల్లు, పంతం వెంకన్న, పెద్దింటి మోహన్‌రెడ్డి, బండ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురంలో బొడ్రాయి 3వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కేశిడి సరళా యాదవరెడ్డి, కేశిడి రవీందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, తిరుమని యాదగిరి, వై.నరేష్, పేరాల వీరేష్, సుంకరి జనార్దన్, రాపాక సోమేష్, బత్తుల శ్రీను, వెంకన్న, రాముగౌడ్ పాల్గొన్నారు.

మద్దిరాల : ప్రతి ఒక్కరూ దైవం పట్ల భక్తిభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మామిళ్లమడవ గ్రామంలో అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర సమేత గణపతి, నవగ్రహ త్రయాహ్నిక ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూకల జగన్ రెడ్డి, పచ్చిపాల వెంకన్న, కృష్ణమూర్తి, వాసంపెల్లి వెంకట్‌రెడ్డి, భిక్షం, నరేందర్‌రెడ్డి, కాశీం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



అర్వపల్లి దేవాలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు



అర్వపల్లి : ప్రచారం చేస్తున్న నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 20 నుంచి వైభవంగా నిర్వహిస్తామని డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానంద చారి, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం దేవాలయంలో ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 24న కల్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు. అలాగే 26న రథోత్సవం, 28న పాన్నోత్సవం, మార్చి 5న పారువేట కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు అన్నదానంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, కబడ్డీ క్రీడోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ, మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, అర్చకుడు రాంబాబు అయ్యంగార్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం

యోగానందలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి ప్రారంభంకానుండటంతో ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆదివారం అర్వపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బింగి శ్రీకాంత్, కోటి ప్రసాద్, కుంభం సతీష్ పాల్గొన్నారు.

వరికి తెగుళ్లు.. ఆందోళనలో రైతులు

- పసుపు రంగులోకి మారి ఎదుగుదల లోపించిన పంట



కుక్కడంలో తెగులు కారణంగా ఎండిపోతున్న వరి పంట

మద్దిరాల : వరిపంటలకు తెగుళ్లు సోకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దిరాల మండలంలో ఈ సీజన్‌లో 13వేల 30 ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. కానీ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా పంట ఎదుగుల సరిగా ఉండడంలేదు. అంతేకాకుండా అగ్గి తెగులు సోకడం కారణంగా పంట మొత్తం పసుపు రంగులోకి మారి ఎండిపోతోందని రైతులు అంటున్నారు. పంటలో సగానికి పైగా పంట నష్టం వాటిల్లేలా ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. వరి పంట సస్యరక్షణ చర్యలపై అధికారులు తగిన సలహాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సస్యరక్షణ చర్యలు ముఖ్యం..

రైతులు వరి పంటను ఆశించిన చీడ పీడలను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల పంట పొలాలు పసుపు రంగులోకి మారి ఎండిపోతున్నాయి. దీనికి కారణం చాలా మంది రైతులు పంట విత్తిన 20రోజుల్లో కలుపు మందు పిచికారీ చేయడం అని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. 20రోజుల్లో కలుపు మందు వేయడం వల్ల భూమిలో సరిపడా పోషకాలు లేక పంట ఎరుపు రంగులోకి మారుతుందని వారు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో పంటను కొన్ని రోజులు ఆరబెట్టి యూరియా వేయాలని, అప్పుడు పొలం యథాస్థానికి వస్తుందని సూచిస్తున్నారు. ఒక వేళ పంట రికవరీ కాకపోతే ట్రీపుల్ నైంటీన్‌తోపాటు మైక్రోన్యూట్రీన్స్ పిచికారీ చేసుకోవాలని, తెగులు సోకినట్లయితే కార్బెన్‌డిజం మాన్‌కోజెబ్‌ను పిచికారీ చేయాలని తెలుపుతున్నారు. మొగి పురుగు ఉన్నట్లయితే కార్టప్‌హైడ్రోక్లోరైడ్‌ను పిచికారీ చేయడం వల్ల వరి పంట అభివృద్ధి చెందుతుందని వ్యవసాయ అధికారి వికాష్‌పాటిల్ తెలిపారు.

అయోధ్యకు తరలిన రామభక్తులు



నూతనకల్ : అయోధ్యకు తరలివెళ్తున్న భక్తులు



మద్దిరాల నుంచి..

నూతనకల్ : నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రామభక్తులు ఆదివారం అయోధ్యకు తరలివెళ్లారు. జనగామ రైల్వే స్టేషన్‌లో నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్ జెండా ఊపి భక్తులను తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కూరాకుల వెంకన్న, మల్లెపాక సాయిబాబా, ధీన్‌దయాళ్, పగిళ్ల శంకర్, మల్కాపూర్ చిరంజీవి, రామ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి రామభక్తులు ఆదివారం అయోధ్య బాలరాముడి దర్శనానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో కాప రవికుమార్, భూతం సాగర్, వంగూరి రమేష్, వల్లపు అశోక్, ఏటకారి మహేష్, యాకయ్య, శేఖర్, విక్రమ్, వేణు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలి

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 20న జరిగే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్–ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (టీయూడబ్ల్యూజే–ఐజేయూ) జిల్లా సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శంకరమంచి రవీందర్‌శర్మ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. టీయూడబ్ల్యూజే–ఐజేయూ జర్నలిస్టుల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పూసపల్లి యాదగిరి, సోమన్న, వర్దెల్లి వీరమల్లు, వడ్లకొండ శ్రీనివాస్, కోదాటి విక్రం, బింగి వెంకటేశ్వర్లు, నజీరోద్దీన్, లింగమూర్తి, రాజేంద్రప్రసాద్, సూర్యప్రకాశ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపెన్‌పహాడ్ వాసికి స్టేట్ 3వ ర్యాంక్



అంబేద్కర్

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఆత్మకూరు మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్‌కు చెందిన పొట్టపెంజర అంబేద్కర్ స్టేట్ 3వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌ను పలువురు మండల వాసులు అభినందించారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



వి.నరేష్

నాగారం : యూత్ కాంగ్రెస్ ఈటూరు గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా వంగూరి నరేష్, ఉపాధ్యక్షులుగా కన్నెబోయిన లింగస్వామి, కారుపోతుల నరేష్, ప్రధాన కార్యదర్శిగా గోడదాటి సైదులు, కార్యదర్శిగా కొడారి నరేష్, సహాయ కార్యదర్శిగా బొట్టు మధు, కోశాధికారిగా కొండ నరేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా వంగూరి కుమార్‌లను ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్మకంటి సోమన్న నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం యూత్ అధ్యక్షుడు వంగూరి నరేష్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మకూర్ (ఎస్) : ఏపూరులో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మకూర్ (ఎస్) : ఏపూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011– 12 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వెంకటయ్య, వీరారెడ్డి, వెంకట రాంరెడ్డి, వెంకన్న, శ్రీనివాసచారి, దయాకర్‌రావు, సైదులు, పూర్వ విద్యార్థులు ఎరుకల సైదులు, జలగం సతీష్, నాగరాజు, మహేష్, శివ, ఉపేందర్, మౌనిక, సరస్వతి, శ్రీలత, అనిత, సరిత, సంధ్య, పావని పాల్గొన్నారు.

కేజీబీవీలో 'ఫేర్‌వెల్' వేడుకలు

అర్వపల్లి : విద్యార్థినులు పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అర్వపల్లి కేజీబీవీ ప్రత్యేక అధికారిణి నాగరాణి కోరారు. స్థానిక కేజీబీవీలో ఆదివారం 9వ తరగతి విద్యార్థినులు పదో తరగతి విద్యార్థినులకు ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటపాటలతో గడిపారు. కార్యక్రమంలో సీఆర్‌టీలు విజయశ్రీ, స్వప్నమేరి, భవాని, రేణుక, విజయ, అరుణ, జ్యోతి పాల్గొన్నారు.



అర్వపల్లి : ఫేర్‌వెల్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, సీఆర్‌టీలు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కుక్కడంలో పనులను ప్రారంభిస్తున్న అవిలమల్లు

మద్దిరాల : కుక్కడం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశానుసారం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దెల భిక్షపతి, బానోతు శ్రీనివాస్, మద్దెల సోమయ్య, మద్దెల రాములు, మద్దెల ముత్తయ్య, తలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆలకుంట్ల ఎల్లయ్య, ముక్కాల వీరస్వామి, వల్లపు కొమరయ్య, నక్క క్రిష్ణా, శివయ్య, భాస్కర్, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతు



కొనసాగుతున్న మరమ్మతు పనులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పుతండా ఫార్మేషన్ రోడ్డు పూర్తిగా గుంతలమయమై గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తండాకు చెందిన ధరావత్ గోపి ఆదివారం స్వచ్ఛందంగా జేసీబీని ఏర్పాటు చేసి గుంతల్లో మొరం పోయించి, చదును చేయించే పనులు మొదలుపెట్టారు. 3కిలోమీటర్ల రోడ్డును తాత్కాలికంగా మరమ్మతు చేస్తున్నట్లు దాత గోపి తెలిపారు. దీంతో గోపిని తండా గిరిజనులు అభినందించారు.

మంత్రి ఉత్తమ్‌కు వినతి

నడిగూడెం : మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆదిమళ్ల సురేష్ ఆదివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాలకు అంతర్గత రహదారులు, సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, అభివృద్ధికి సహకరించాలని వినతిలో కోరినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పెన్‌పహాడ్ : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. సూర్యాపేటకు చెందిన దుర్గయ్య పెన్‌పహాడ్ నుంచి సూర్యాపేట బయలుదేరాడు. మార్గమధ్యలో అనంతారం క్రాస్ రోడ్డు వద్ద గ్రామానికి చెందిన మల్గిరెడ్డి రాంరెడ్డిని లిఫ్ట్ అడిగి బైక్‌పై వెళ్తున్నారు. గరిడేపల్లి మండలం పరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సైదులు సూర్యాపేట నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా సింగారెడ్డిపాలెం గ్రామ మూలమలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.